క్లుప్తంగా

పాఠశాలకు విరాళం

బంట్వారం: బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ వడ్ల నందు ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేయడం కోసం గురువారం రూ.50 వేలు విరాళం అందజేశారు. అంతే కాకుండా పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ పద్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, మాజీ చైర్మన్ బసిరెడ్డి, మాలసోమారం సర్పంచ్ నర్సింహారెడ్డి, నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షుడు ఆలంపల్లి శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ మశ్చందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

యాలాల: తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ తండ్రి వర్త్య వాల్యా నాయక్ బుధవారం రాత్రి మృతి చెందారు. విఠల్ నాయక్ స్వగ్రామమైన బాణాపూర్‌లో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు విఠల్ నాయక్‌ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మెట్లి ఆశన్న, సప్తగిరిగౌడ్, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, నాయకులు రాంచంద్రారెడ్డి, బాలయ్య, బాబయ్య, భీమప్ప ఉన్నారు.

ఉదయమే జెండాల తొలగింపు



అంపల్లి పాఠశాల వద్ద ఉదయమే పతాకం తీసేయడంతో బోసిపోయిన జెండా దిమ్మె

ధారూరు: ఉదయం నుంచి సాయంత్రం వరకు రెపరెపలాడాల్సిన మువ్వన్నెల జెండాలను ఉదయం 11.30 గంటలకే తొలగించారు. ఈ సంఘటన ధారూరు మండల పరిధిలోని అంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల ఆవరణలో జెండాలను ఎగురవేశారు. ఈ జెండాలను సాయంత్రం 5 గంటల వరకు ఉంచాలి. కానీ ఉదయం 11.30 గంటలకే వాటిని తొలగించారు. ఈ సంఘటపై స్థానికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జాతీయ జెండాల విషయంలో జీపీ, ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.


క్రీడల్లో గెలుపోటములు సహజం



టాస్ వేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో వికారాబాద్ జర్నలిస్టులు, న్యాయవాదుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యాయవాదుల జట్టు, నిర్ణీత 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జర్నలిస్ట్ టీం 10 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతగా నిలిచిన పాత్రికేయ జట్టు బహుమతి అందుకుంది. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్: భారత్ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్వీ) క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి జిలాని ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పూడూరు: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శరీర దారుఢ్యం అవలంబిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కెరవెల్లిలో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, సర్పంచ్ రామస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వీరస్వామిగౌడ్ ఉన్నారు.



కొడంగల్: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు



వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



ధారూరు: భరతమాత వేషధారణతో విద్యార్థినుల ర్యాలీ

ఘనంగా గణతంత్ర దినోత్సవం

రిపబ్లిక్ డే సంబురాలు అంబరాన్నంటాయి. ఊరువాడ త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు, రాజకీయ పార్టీల ఆఫీసులు, ప్రజా సంఘాలు ఇలా ప్రతి చోటా అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు, సకల జనులు మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ఎస్పీ కార్యాలయంపై జెండాను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ రషీద్



తాండూరు: విద్యార్థులతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



దౌల్తాబాద్: పోలీస్‌స్టేషన్‌లో



తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు



బంట్వారం: తొర్మామిడి రైతు వేదిక వద్ద రైతుబంధు జిల్లా కమిటీ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి



పూడూరు: తహసిల్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్



పరిగి: ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు



కుల్కచర్ల: తహసిల్ కార్యాలయంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, ప్రజాప్రతినిధులు.



మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ యాదగిరి



యాలాల: మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న ఎంపీపీ తదితరులు

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

కొడంగల్: నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం మెగాజాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రేయాన్ కన్సల్టెన్సీ సర్వీసెస్ వారి సహకారంతో అర్హులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 29 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఇందులో 50కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు వారి ధ్రువ పత్రాలు (సర్టిఫికెట్స్) తీసుకురావాలని సూచించారు. ఇతర నైపుణ్యాలు ఉంటే వాటి పత్రాలు కూడా తీసుకురావాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 88853 61812, 89190 44721 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మునీర్, పకీరప్ప, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

సమయపాలన పాటించని ఆర్టీసీ

ఉన్నఫలంగా ట్రిప్పులు రద్దుచేస్తున్న సంస్థ



కోట్‌పల్లి లోకల్ బస్సు

బంట్వారం: కోట్‌పల్లి లోకల్ బస్సును ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. వేళలు పాటించకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వికారాబాద్ టూ కోట్‌పల్లికి ఐదు ట్రిప్పులు నడుపాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వలన బస్సులు సరిగా తిరగడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి ట్రిప్పులు రద్దుచేస్తుండడంతో గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితని పలువురు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వేళకు సర్వీసులు నడిపించి గ్రామస్తుల ప్రయాణ ఇక్కట్లు తొలగించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే విషయంపై డీఎం వీర్యా నాయక్‌ను ప్రశ్నించగా.. వికారాబాద్-కోట్‌పల్లి లోకల్ బస్సును సక్రమంగానే నడిపిస్తున్నామని, కొన్నిసార్లు ప్రయాణికులు లేకపోతే రద్దు చేయాల్సి ఉంటుందని చెప్పారు. కనీసం డీజిల్ ఖర్చులకైనా కలెక్షన్ రావాలి కదా అన్నారు. బస్సు వేళలు పాటించేలా చూస్తామని, ప్రయాణికుల రద్దీ ఉంటే ట్రిప్పులు రద్దు చేసే ప్రసక్తే ఉండదని వెల్లడించారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

యాలాల: ఈ ఏడాది విద్యాసంవత్సరంలో వందశాతం హాజరు కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పది మంది విద్యార్థుల తల్లిదండ్రులను పూలమాలలు వేసి, శాలువాలతో పాఠశాల సిబ్బంది సన్మానించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరేశం, ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సంగయ్య, ఉపాధ్యాయులు మోహనయ్య, మాధవి, మధుసూదన్, లాజర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించిన ఉపాధ్యాయులు

విద్యావ్యవస్థ ఉన్నతికి పాటుపడాలి



ఎంఈఓకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మనోహర్ రెడ్డి, శేరిరాం రెడ్డి

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందజేసేందుకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి గురువారం రూ.50వేలు ఎంఈఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ ఉన్నతికి ప్రతీ ఒక్కరు తమవంతు సహాయాన్ని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, సర్పంచ్ సామ్యారెడ్డి, ఎంఈఓ అబీబ్ అహ్మద్ స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ సభ్యుడికి అవమానం

దోమ: గణతంత్ర దినోత్సవంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజ పాషకు అవమానం జరిగింది. గురువారం జరిగిన ఉత్సవంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి మండల సభ్యులను ఆహ్వానించినప్పటికీ.. తనకు ఆహ్వానం లేదని ఎంపీడీఓపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కూడా మైనార్టీ కార్పొరేషన్ విషయంలో ఇలాగే జరిగిందని, ప్రస్తుత గణతంత్ర వేడుకలకు ఆహ్వానించలేదని ఖాజ చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

మర్పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిపబ్లిక్ డే సందర్భంగా.. హెచ్‌ఎం శ్రీశైలం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసేందుకు జెడ్పీటీసీ రూ.10 వేలు నగదు అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్ మనోహర్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్, అడ్వకేట్ మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతతోనే అభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: యువత అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకున్నప్పుడే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని కేతిరెడ్డిపల్లి సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ అన్నారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో పలు యువజన సంఘాలు, గ్రామ పంచాయతీ, పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేతిరెడ్డిపల్లి గ్రామంలో వివిధ యువజన సంఘాలు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయని, గ్రామాలు యువతతోనే అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, వివిధ యువజన సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

తలకిందులుగా త్రివర్ణ పతాకం

తాండూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. పట్టణంలోని అంబేడ్కర్ పార్క్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఉత్సవంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. ఈ వేడుకలో ఆర్డీఓ అశోక్‌కుమార్ పాల్గొని జెండా ఎగురవేయగా.. పతాకం తలకిందులుగా వేలాడింది. అప్పటికే జాతీయ గీతాన్ని ఆలపించారు. తరువాత పరిశీలించిన నాయకులు జెండాను కిందకు దించి సరిచేసి మళ్లీ ఎక్కించడం గమనార్హం. జెండా ఎగుర వేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకలకు ముందు రోజు అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి, కమిటీ వేసి ఏర్పాట్లను పరిశీలించాలి. కానీ ఆర్డీఓ అశోక్‌కుమార్ అధికారులతో సమావేశం నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. త్రివర్ణ పతాకం తలకిందులుగా ఎగురవేయడం దురదృష్టకరమన్నారు.

పరిమితికి లోబడి వైద్యం చేయాలి



ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ అర్బన్: ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు వారి పరిమితికి లోబడి వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆర్‌ఎంపీ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించి ఆపరేషన్లు చేయడం, అనవసరమైన స్టెరాయిడ్స్ పెట్టడం వంటివి చేయరాదన్నారు. ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహించి, మెరుగైన చికిత్స కోసం ఇతర వైద్యుల వద్దకు వెళ్లేలా సూచించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు వారి సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

శంకర్‌పల్లి: గోపులారం గ్రామ శివారులో చిన్నమంగళారానికి వెళ్లేందుకు మూసీపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఇరుగ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులతో కలిసి పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ జగన్ మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గోపులారం గ్రామం నుంచి మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామాల మధ్య మూసీవాగుపై వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 5.25కోట్లను మంజూరు చేసిందని చెప్పారు. వచ్చే ఆరు నెలల్లో వంతెన నిర్మాణం పనులు పూర్తవుతాయని తెలిపారు. ఇందుకు ఇరు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్మాణదారులకు సూచించారు. చేవెళ్ల పంచాయతీ రాజ్ ఏఈ ప్రశాంత్‌రెడ్డి, గోపులారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక సంబురం రద్దు

- రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల తీరుపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల మండిపాటు

తాండూరు: అధికారుల మధ్య నెలకొన్న సమన్వయ లోపం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు శాపంగా మారింది. ఏటా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సామూహిక రిపబ్లిక్ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకోసం ఎంఈఓ వెంకటయ్య ఈ నెల 25న పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు గణతంత్ర వేడుకలను జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు విజయవంతం చేయాలని ప్రకటన విడుదల చేశారు. వేడుకలకు విద్యార్థులను ఉదయం 8.30 గంటల లోపు రావాలని సమాచారం ఇచ్చారు. దీంతో ప్రైవేటు పాఠశాలలు వేడుకలను సిద్ధమయ్యాయి. తీరా సమయానికి గణతంత్ర వేడుకలు ఉదయం 8 గంటలు దాటిన తర్వాత రద్దు చేశామంటూ రెవెన్యూ అధికారుల నుంచి ఎంఈఓకు మెసేజ్ వచ్చింది. దీంతో చేసేది లేక పాఠశాలల యాజమాన్యాలకు కార్యక్రమం రద్దయిందని చెప్పారు. ఈ విషయంపై పాఠశాలల యాజమాన్యాలు అధికారుల తీరుపై మండిపడ్డారు. వేడుకల రద్దు విషయం ముందే చెప్పాలి కానీ.. తీరా సమయానికి చెప్పడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు.



బోసిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం

సమన్వయలోపం వల్లే..

జాతీయ వేడుకలు ప్రధానంగా రెవెన్యూ శాఖ ఆధీనంలో జరుగుతాయి. ఈ శాఖ ఆదేశాల మేరకే విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. కాని ఈ సారి వేడుకలు రద్దయ్యాయనే విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గణతంత్ర వేడుకలకు రెండు రోజుల ముందు అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో రెవెన్యూ శాఖ అధికారి సమీక్ష నిర్వహించి కమిటీ ఏర్పాటు చేస్తారు. ఈ సారి ఎలాంటి సమీక్షలు నిర్వహించకుండానే వేడుకలను నిర్వహించారు. రిపబ్లిక్ డేలో వేలాది మందితో కళకళలాడే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బోసిపోయింది.